# చెత్తా చెదారం

క్రేన్ కథల పోటీలో
తృతీయ బహుమతి
పొందిన కథ

-అద్దేపల్లి ప్రభు



"ఓహో.... యిక్కడో నర్మదా బచావో వచ్చిందే...." అనుకున్నాడు. కంప్యూటర్ ముందు కూర్చొని వార్తలు కొట్టుకుంటున్న రాజుతో అన్నాడు. "నాగరాజూ... దొంతమూరు బచావో అని ఓ ఆందోళన వస్తోంది...." అని నాగరాజు తలతిప్పలేదు. వేళ్లని ఆపలేదు. 'దొంతమూరా' అన్నాడు. "దొంతమూరులో వాటర్ టాంకులు కడుతున్నారు కదా. వాటి వల్ల కొంత మందికి నష్టంట! అందుకని దాన్నాపేయాలంట" వ్యంగం ధ్వనిస్తోందేంటి?

అలాగా అన్నాడు నాగరాజు తలతిప్పనూలేదూ. గొంతులో ఏ ఎమోషనూలేదు.

''ఏంటలాగా అంటావ్... ఆ టాంకుల వల్ల కనీసం పది.... పదిహేను వేల మందికి నీళ్లు దొరుకుతాయి తెల్సా" గొంతు కొంచెం ఉద్రిక్తమయ్యింది.

"ఈ కాసిన్ని మంది కోసం అంత పెద్ద ప్రాజెక్ట్ ఆపేయాలా? బుర్రుండే విషయమేనా యిది... నేను తిరిగాను రాజూ ఆ ఏరియా... మంచినీళ్ళకి ఎంత కరువో తెల్సా? మైళ్లకొద్దీ దూరం వెళ్ళి తెచ్చుకోవాలి నీళ్లు... ఎన్నో ఏళ్ళ తరువాత ఈ పథకం వచ్చింది... వెంటనే ఈ గొడవ....".

ఎందుకింత ఆవేశం?.... ఓ జర్నలిస్టుగా తనకి ఇంత ఉద్రేకం పనికి రాదుకదా.... నాగరాజు కొంచెం ఆశ్చర్యంగా చూసాడు. ఆ గొంతులోని ఘాటు తగిలిన వాడిలా చూసి మళ్లీ తన పనిలో పడిపోయాడు.

నాగరాజు ఈ విషయమై స్పందిస్తాడనో... చర్చిస్తాడనో చెప్పలేదు. తన ఆవేశం బహిర్గతం కావాలి.... అంతే...

కాసేపు వూరుకొని -

"వో.. నాల్రోజులు గొడవ చేస్తారు.... మళ్లీ మామూలే .... అయినా కొన్ని విషయాల్లో కఠినంగా ఉండాల్లే... లేకపోతే ప్రతి దానికీ ఏదో ఓ గుంపు బయలుదేరడమే... ఒక అర్థం పర్థం లేదు. పైగా మంత్రి ఎం.ఎల్.ఎ. యిద్దరూ దళితులే కదా.... తమ వాళ్ళకి అన్యాయం జరుగుతుంటే వూరు కుంటారా.... నాన్సెన్స్..." అని గొణుక్కున్నట్టుగా అన్నాడు.

ఆ ప్రెస్‌నోట్‌ని తీసి పక్కన పడేసాడు.

అయితే అక్కడితో వదల్లేదది...

మరో రెండు రోజుల తరువాత ట్యాంకుల నిర్మాణం కోసం కాంట్రాక్టర్ ఆ స్థలానికి వెళ్లినప్పుడు వందల మంది దళితులు ఆ

ఇదంతా యిలా చెత్త చెత్తగా తయారౌతుందని ఊహించక ముందు ఈ విషయాన్ని గురించి రాసిన ఐటమ్ యిలా వుంది.

**కాకినాడ, ఏప్రిల్ 10 :** సుమారు పదిహేను గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చే దొంతమూరు వాటర్ టాంకుల నిర్మాణానికి రాష్ట్ర మంత్రి పి. చంద్రరావు మంగళవారం శంకుస్థాపన చేసారు. దొంతమూరు పరిసర గ్రామాలకు ఈ పథకం ద్వారా మంచినీటి సదుపాయం కలుగుతుందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. తమ పార్టీ, ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు కట్టుబడి వుందనీ, అభివృద్ధి కోసం ప్రాణాలైనా యిస్తామనీ ఆయన ఉద్వేగంగా అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యుడు జి. వివేకానందం, పార్టీ నాయకుడు బుచ్చయ్య చలపతిరావు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'అభివృద్ధి కోసం ప్రాణాలివ్వడం'... ఏంటో ఈ పిచ్చి వాక్యం అని అప్పుడు నవ్వుకున్నాడు కూడా.

చిన్నవార్త. సింగల్ కాలమ్. అంతే అయిపోయింది. మళ్లీ దాని వూసు ఎత్తాల్సి వస్తుందని వూహించను కూడా లేదు.

ఈ వార్త రాసిన మూడోరోజు కావచ్చు 'దొంతమూరు వాటర్ టాంకు నిర్మాణం నిలిపి వేయాలి' అని ఓ ప్రెస్‌నోట్ వచ్చింది. దొంత మూరులో ప్రస్తుతం నిర్మించతలపెట్టిన వాటర్ టాంకుల వల్ల సుమారు ఎనిమిది వందల దళిత కుటుంబాలు నిర్వాసితులౌతారని - ఆ చెరువు భూమిని దళితులు మూడు తరాలుగా సాగు చేసుకొని జీవిస్తున్నారనీ - ఎటువంటి పునరావాసం కల్పించకుండా ఈ వాటర్ టాంకులు నిర్మిస్తే దళితులు నిరాశ్రయులవుతారు కాబట్టి నిర్మాణం ఆపేయాలని దాని సారాంశం. ఏవో కొన్ని దళిత సంఘాలు, రెండు ఎమ్మెల్ పార్టీలు దాని మీద సంతకాలు చేసాయి.

చెరువులో బైఠాయించి నిర్మాణ పనుల్ని అడ్డుకున్నారు. కంట్రాక్టర్ ఏమీ చైలేక తిరిగి వచ్చేసాడు.

ఆ సాయంత్రం కలెక్టర్ ఆఫీసు దగ్గర దళితులు ఆందోళన నిర్వహించారు. వందల మంది ఆడవాళ్లు... పిల్లలు... ముసలీ... ముతకా అందరూ వున్నారు.

ఇక దాని గురించి వెళ్లక తప్పింది కాదు.

ఆఫీసు దగ్గర వందల మంది పోగై నినాదాలు చేస్తున్నారు. నాయకులు ఉపన్యాసాలిస్తున్నారు.

అబ్బో.... జనాన్ని బానే తరలించారే... (అయినా తనకీ భావాలేంటి? ఏదో జర్నలిస్టుగా వస్తాం... చూస్తాం... రాస్తాం... అంతే...)

సమస్యని అధికార్లూ... పోలీసులు పరిష్కరిస్తారు కదా....

అవును పరిష్కారం మొదలవబోతోంది.

పోలీసు అధికారులు నాయకులతో ఏదో మాట్లాడుతున్నారు. జనమంతా వారి చుట్టూ గుంపు కదుతున్నారు. (గమ్మున వెళ్లాలి... ఏదో టెన్షన్ రైజవుతోంది) జనం నినాదాలు యిస్తూనే వున్నారు.

ఇంతలో మొదలైపోయింది.... లాఠీఛార్జీ....

పోలీసులు దొరికిన వాళ్లనల్లా చితకబాదేస్తుంటే జనమంతా పరుగులు దీసారు.

'అమ్మ నాయినా... ఈ మందిలో వుంటే మన్నీ బాదేస్తారు. మళ్లీ మర్నాడు 'జర్నలిస్టుపై పోలీసు లాఠీ' అని మన వార్త మనమే రాసుకోవాలి...

హ.... హ్హా...'

అనుకుంటూ సి.ఐ. దగ్గరకు చేరాడు.

'నమస్తే సార్...'

సి.ఐ. చిరాగ్గా వున్నాడు. (లేకపోతే టెన్షన్‌లో హాయిగా వుంటాడా... అయినా నవ్వుతున్నాడేం)

'వచ్చేసారా... మీరింకా రాలేదేంటా అనుకుంటున్నాం...' (అలా నవ్వడం ఎలాగబ్బా) మెల్లిగా రిపోర్టర్లందరూ చేరుతున్నారు.

'అసలేమయింది సార్... యింత వరకూ బాగానే వుంది గదా....''

'బాగా అంటూ ఏముందీ.... యిక్కడిలా జనం పోగుబడితే లా అండ్ ఆర్డర్ ప్రోబ్లం వస్తుంది. చెప్పి వెళ్లిపోండి అన్నాం.... వెళ్ళం అన్నారు... మరి తప్పలేదు...' అన్నాడు సి.ఐ. అనడంతోనే జీపెక్కి 'మళ్లీ కలుద్దాం' అనుకుంటూ వెళ్లిపోయాడు.

అమ్మో... ఇంకేం అడక్కుండా పారిపోయాడు... సరే... ఈ నాయకుల్ని ఎలాగూ కలుస్తాం... కలెక్టర్‌ని కూడా కలిస్తే సరిపోతుంది...

ఓ గంటకి నాయకులు ప్రెస్‌మీటని ఫోను.... లాడ్జిలో అందరూ కూర్చున్నాకా నల్లగా వుండి భూతద్దాల కళ్లజోడు పెట్టుకున్న నాయకుడు మాట్లాడాడు.

''మేం ఈ విషయమై కలెక్టర్ గారికి మెమోరాండం ఇద్దామని వచ్చాం. మరో పదినిముషాల్లో కలుస్తానని కలెక్టర్ గారు అన్నారు. ఈలోగా పోలీసులు అన్యాయంగా లాఠీఛార్జి చేసారు. దీన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం ప్రజాస్వామ్య దేశంలో...

(మొదలెట్టాడ్రా....) బిస్కెట్లు తింటూ... డ్రింకులు తాగుతూ వింటున్నారు. నాయకుడు లాఠీ దెబ్బలు తిన్న వాళ్లని చూపిస్తున్నాడు.

“అసలు మీరు వాటర్ టాంకుల్ని ఎందుకు అడ్డుకుంటున్నారు” అడిగాడు రిపోర్టర్.

గదిలో నిశ్శబ్దం.

నాయకుడు గదిలో అందర్నీ తేరిపార చూసాడు. చూసి “వాటర్ టాంకుల్ని కట్టొద్దు అనడం లేదండీ మేం... అభివృద్ధి కార్యక్రమాలకి మేం వ్యతిరేకం కాదు. కానీ నిర్వాసితులకి పునరావాసం ఏదైనా కల్పించాలి కదా... వంద సంవత్సరాలకి పైగా అక్కడ నివాసముంటున్నారు. ఇప్పుడు హఠాత్తుగా వెళ్లిపొమ్మంటే ఎలా... మేం పునరావాసం చూపించండీ అంటున్నాం.... అంత వరకూ నిర్మాణాన్ని వాయిదా వెయ్యాలంటున్నాం అంతే” అన్నాడు.

అతనితోపాటు పక్కన కూర్చున్న వ్యక్తిని ఎక్కడో చూసి నట్టుందే... అనుకుంటుండగా అతనే వచ్చాడు...

'మూర్తిగారూ... బాగున్నారా' అంటూ

ప్రెస్‌మీట్ ముగిసింది. అందరూ వెళ్లిపోతున్నారు.

.... ఆ గుర్తొచ్చింది. దొంతమూరు నీళ్ల సమస్య గురించి స్టోరీ చైదానికి వెళ్లినప్పుడు ఈ కుర్రాడే తనతో బాగా తిరిగాడు. అన్ని వూళ్లూ తిప్పి తాము మంచి నీళ్ల కోసం ఎలా ఇబ్బందులు పడుతున్నామో చెప్పాడు. నీళ్ళ లేవనే తమ ప్రాంతంలోని మగ పిల్లలకి ఆడపిల్లల్నివ్వడానికి ఎవరూ రాడంలేదన్నాడు.

“ఇంకేం కాదు సార్... యిప్పుడు యిక్కడ కావల్సింది నీళ్లు...” అని ఎంత ఉద్వేగంగా అన్నాడు?

అతను.... ఈ గుంపులోనా...

“మీరు ..... వీర్రాజు కదా.....” అన్నాడు.

“ఆఁ..... గుర్తున్నానన్నమాట.... రండి టీ తాగుదాం....”

## అద్దేపల్లి ప్రభు



వృత్తి అధ్యాపకత్వం, ప్రవృత్తి రచనా వ్యాసంగం. కథైనా కవితైనా ప్రభుది ప్రత్యేక శైలి ఈ సంవత్సరం ఉమ్మిడి శెట్టి సాహితీ అవార్డును తన కవితా సంపుటి “పారిపోలేం” కు అందుకున్న ప్రభు కథల్లో కూడా బహుమతిని సొంతం చేసుకున్నారు. అక్టోబర్10, 1963న జన్మించారు. ప్రస్తుతం కాకినాడలో పనిచేస్తున్నారు. సమకాలీన సామాజిక సమస్యలను తన రచనలద్వారా వెలుగులోకి తీసుకురావడం, వ్యంగ్యమైన వివరణను ఇవ్వడం ప్రభు కలంబలం.

అని బయటకి నడిచాడు.

"టీ తాగుతుండగా అడిగాడు.

"మీరిందులో ఉన్నారేంటి?" అతను యిలాంటి ప్రశ్నను ఆశించలేదులా వుంది. ఒక్క క్షణం అయోమయంగా చూసి 'అంటే...' అన్నాడు.

(కొంచెం ఘాటుగా అన్నాడేమో) అనుకొని మృదువుగా....

"అదే ... అంటే మీరు నీళ్లు కావాలని చాలా పోరాడారు కదా... మళ్లీ యిందులో కొచ్చారేంటా అని...." అన్నాడు.

"అదా...." అని నవ్వాడు. అతని నల్లని ముఖంలో ఆ నవ్వు చిత్రంగా దుఃఖంలా కనిపించింది.

"మేం వుండేది... ఆ చెరువు దగ్గరే నండీ...." అని ఆగాడు.

తాను వెంటనే అన్నాడు.

"కానీ... నీళ్లు కావాలికదా... నీళ్లు.... నిజం చెప్పాలంటే మీ వల్లనే నేనీ ప్రాజెక్టు గురించి స్టడీ చేసాను. మీ వల్లనే ఆ సమస్యని బాగా వొంటికి పట్టించుకున్నాను. బహుశా ఈ టాంకులు శాంక్షనైనప్పుడు మీకన్నా ఎక్కువ సంతోషించాను. కానీ యిప్పుడీ గొడవంటే..." నవ్వి ఆగాడు. కొంచెం వూరుకొని.



''వేలాది మంది కోసం... కొంచెం త్యాగం చేయాలి కదా"

వీర్రాజు ముఖం నల్లగా అయిపోయింది. అతనేదో అందామని మళ్లీ వూరుకున్నాడు. అతని పెదాలు చిన్నగా కంపించడం తన దృష్టిని దాటిపోలేదు. అతని కళ్లు అకస్మాత్తుగా " ఆరిపోయినట్టయ్యాయి.

అవును. తన నించి ఇలాంటి వ్యాఖ్య ఆశించి వుండడు.

కానీ... అది తన భావం... అభిప్రాయం... నమ్మకం.... నిర్వాసితుల పట్ల సానుభూతి లేదా... ఎందుకు లేదూ... ఉంది. వాళ్లకి ఇవ్వేళో రేపో ఏదో మార్గం దొరుకుతుంది. కాని ఇప్పుడున్న పరిస్థితుల్లో శాంక్షనైన ప్రాజెక్టు పోతే మళ్లీ వస్తుందా... యిదంతా చెప్పలేదు. అతను బాధితుడు... యివన్నీ చర్చించగలమా....

వీర్రాజు ముఖం యింకా వెంటాడుతూనే వుంది. బహుశా వీర్రాజుతో ఈ మీటింగ్ మూలంగా నేమో వార్త మామూలుగా రాసాడు. అసలు ముందు రాసిన వార్త యిది.

దొంతమూరు నీటిపథకం ఆపాలి

నిర్వాసితుల ఆందోళన – లాఠీఛార్జి

**కాకినాడ, ఏప్రిల్ 18 :** దొంతమూరు నీటి పథకాన్ని వెంటనే నిలిపివేయాలని కోరుతూ నిర్వాసితులు ఈరోజు కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. వందలాదిమంది నిర్వాసితులు కలెక్టరేట్‌ని చుట్టుముట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు లాఠీఛార్జి చేసి జనాన్ని తరిమేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో నిర్వాసితుల నాయకులు లాఠీఛార్జిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్వాసితులకి పునరావాసం కల్పించే వరకూ నీటి పథకాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేసారు.

సింగిల్ కాలమ్ హెడ్డింగ్ కావాలనే పెట్టాడు. కానీ వీర్రాజు మౌనం అతని నవ్వులోని దుఃఖం... అతని పెదాల కంపనం... తన కళ్ల ముందు కదులాడుతూనే ఉన్నై. అందుకే వార్తని మళ్లీ రాసాడు.

'దొంతమూరు నిర్వాసితులపై లాఠీఛార్జి'

**కాకినాడ, ఏప్రిల్ 18 :** దొంతమూరు వాటర్ టాంకుల వల్ల నిర్వాసితులైన వారికి ఎటువంటి ప్రత్యామ్నాయం చూపలేదని, వెంటనే నిర్వాసితులకి పునరావాసం కల్పించాలని కోరుతూ ఈ రోజు కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన జరుపుతున్న దళితులపై పోలీసులు లాఠీఛార్జి జరిపారు. ఈ లాఠీఛార్జిలో పలువురు గాయపడ్డారు. ఈ సందర్భంగా పత్రికా విలేకరులతో మాట్లాడుతూ నిర్వాసితుల నాయకులు లాఠీ ఛార్జిని తీవ్రంగా ఖండిచారు. కలెక్టర్ తమని కలవడానికి అంగీకరించారనీ... అయినా పోలీసులు లాఠీఛార్జి జరపడం అప్రజాస్వామికమని వారన్నారు. తాము నీటి పథకానికి వ్యతిరేకం కాదని... కానీ తరతరాలుగా అక్కడున్న దళితుల్ని ఆకస్మికంగా పొమ్మంటే ఏమవుతారని వారు ప్రశ్నించారు.

**ప్రత్యామ్నాయం కల్పిస్తాం : కలెక్టర్ హామీ**

దొంతమూరు నిర్వాసితులకు తగిన పునరావాసం కల్పిస్తామని ఈ విషయంలో వారు ఆందోళన చెందాల్సిన పనిలేదని కలెక్టర్ అన్నారు. వేలాది మందికి ప్రయోజనం కల్పించే నీటి పథకాన్ని వివాదాస్పదం చైడం తగదని ఆయన ఆందోళన కారులకు హితవు చెప్పారు.

ఇలా రాసాకా కొంచెం మనసు శాంతించింది. కానీ... అంతే...రోడ్ల వెడల్పు చేసినప్పుడు ఇలాగే గొడవలయ్యాయి. కానీ టౌన్లు మరి బాగయ్యాయా లేదా.. బహుశా అభివృద్ధి కోసం త్యాగం తప్పదేమో...

అయినా వీర్రాజు ముఖం ఇంకా మాసిపోలేదు.

నీళ్ల కోసం వీర్రాజు చాలా పోరాడాడు. తనకి తెల్సు. ఆ ఏరియాలో యూనివర్సిటీ వరకూ చదివిన దళితుడు అతను. ఆఫీసుల చుట్టూ, రాజకీయ నాయకుల చుట్టూ నీళ్ల సమస్య గురించి తెగ తిరిగాడు. జనాన్ని కదిలించాడు. అన్నీ చేసి తీరా.... అది వచ్చే సరికి తమ మీదకే వచ్చిందన్న మాట... కానీ.... మరేం చేయాలి...? కానీ అసలు వ్యవహారం మర్నాడు మొదలైంది. ట్రాక్టర్లలోనూ, లారీల్లోనూ వేలాది మంది జనం కలెక్టర్ ఆఫీసు దగ్గర కొచ్చారు.

వాటర్ టాంకుల్ని వెంటనే నిర్మించాలి

దొంతమూరు పరిసర ప్రజలు డిమాండ్

**కాకినాడ, ఏప్రిల్ 19 :** వేలాది మందికి ప్రయోజనం చేకూర్చే దొంతమూరు వాటర్ టాంకుల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని దొంతమూరు పరిసర ప్రాంతాల నుండి వచ్చిన వేలాది మంది ప్రజలు కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ



కొంత మంది స్వార్థపరులు తమ స్వీయ ప్రయోజనాల కోసం అభివృద్ధి కార్యక్రమాలకి అడ్డం పడుతున్నారని అధికారులు ఈ విషయమై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారితో మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల అమలులో కఠినంగా వ్యవహరిస్తామని హామీ యిచ్చారు. ఈ కార్యక్రమానికి ఆ ప్రాంత నాయకులు బుచ్చయ్య దొర, ఎం. సుందరరావు తదితరులు నాయకత్వం వహించారు.

ఇదంతా ఇలా చెత్త చెత్తగా తయారౌతుందని తను వూహించలేదు. తనకీ ద్వైదీభావం పోదంలేదు. వీర్రాజు ముఖమే గుర్తొస్తోంది. నీళ్లు అందరికీ కావాలి. కాని కొందర్ని ఆ నీళ్లు ముంచేస్తే.... మంత్రులన్నట్టు అభివృద్ధి కోసం త్యాగం చైక తప్పదా....?

రెండు రోజుల తరువాత ఆ ప్రాంతంలో నిర్మాణం మొదలైంది. దళితులు చెరువులో పడి శోకాన్నాలు పెట్టారట. కానీ పోలీసులు వారిని అక్కడి నుంచి ఈడ్చుకొని తీసుకొనిపోయారు. కాంట్రాక్టర్ పొక్లెయినర్‌తో ఆ ఇళ్లని నేలమట్టం చేసి పనులు మొదలుపెట్టాడు. అధికార్లందరూ దగ్గరుండి ఈ కార్యక్రమం చేయించారు. కొంత మంది నాయకుల్ని అరెస్టు చేసి తరువాత వదిలేసారు.

అవును! వాళ్లలో వీర్రాజూ వున్నాడు.

తర్వాత ఏమైందీ తెలియలేదు. అయితే ఏం లే... నీళ్ల సమస్య తీరింది.

టాంకుల నిర్మాణం పూర్తయినాక ఓరోజు సాయంత్రం ఆ కాంట్రాక్టర్ రంగారావు చిన్న విందు ఏర్పాటు చేసాడు. దానికి మంత్రి చంద్రరావు, ఎం.ఎల్.ఎ. వివేకానందం అందరూ రావడంతో వెళ్లక తప్పింది కాదు.

అక్కడ తగిలాడు వీర్రాజు

మనిషి బాగా చిక్కిపోయాడు. గడ్డం బాగా పెరిగింది. ముఖం యింకా నల్లబడింది. కాంట్రాక్టర్ యింటి ముందున్న చిన్న బస్టాప్‌లో కొంత మందితో కలిసి కూర్చొని వున్నాడు. అతను తన్ని చూడలేదు. తనే దగ్గరకెళ్లాడు. తన్ని చూడగానే వీర్రాజు లేచి 'నమస్తే సార్....' అనుకుంటూ వచ్చాడు.

''బాగున్నారా...' (ఎంత అసందర్భం) చేయి కలుపుతూ అన్నాడు తాను.

"ఏదో యిలా వున్నాం సార్..." అని వూరుకున్నాడు.

అతనితో చాలా మాట్లాడాలని వుంది. ఓదార్పా.... సానుభూతి ప్రకటనా... కానీ ఎలా? అతను మునుపటిలా లేదు.... ముభావంగా వున్నాడు. తనతో మాట్లాడ్డం ఇష్టం లేనట్టున్నాడు. కానీ అతన్ని మాట్లాడించాలి.

"ఇలా వచ్చారేంటి?"

"మంత్రిగారు రమ్మన్నారండీ... అందుకని"

అబ్బే యిలా లాభం లేదు...

"రండి టీ తాగొద్దాం" అంటూ చేయి పట్టుకొని బయలు దేరదీసాడు.

వీర్రాజు తన మనుషుల్తో 'ఇప్పుడే వస్తా' అని కదిలాడు.

"ఇప్పుడేం చేస్తున్నారు... తర్వాత ఏమైందీ... వాళ్లంతా ఎక్కడున్నారు....

మళ్లీ ఏమీ తెలీలేదు మీ గురించి"

"చేసేదేముంది సార్.... రిక్షాలు తొక్కుకుంటున్నాం.... అందరూ అలా.... చెల్లా చెదురైపోయాం..." అతని గొంతు వణికింది.

"మరి పునరావాసం"

వీర్రాజు నవ్వాడు "తెలీనట్టు చెప్తారు సార్... అది అంత ఈజీనా... గుడిసెలు కూలగొట్టిన రోజు తలా శేరు బియ్యం పోసారు. అంతే... లిస్టులు తయారవ్వాలి అన్నారు... దాని గురించే మంత్రిగారు

రమ్మంటే వచ్చాం..." ఆగాడు.

ఆగి... "ఏదో మూల పడేస్తారు... అక్కడితో సరిపోద్ది" అన్నాడు.

తనకేం మాట్లాడాలో తెలియలేదు. ఓదార్పు కోసం అన్నాడు.

"కొంచెం లేటయినా వస్తారులెండి... మంత్రిగారు... ఎం.ఎల్.ఎ.గారు... ఇద్దరూ మీవాళ్లే కదా...." (ఇది బాలేదు కానీ ఓదార్పు కోసం)

వీర్రాజు నవ్వి అన్నాడు "వాళ్లు మీ మా వాళ్లేంటి సార్... వాళ్ల వల్లే కదా మీ బతుకు యిలా అయింది".

"అంటే"

వీర్రాజు కొంచెం కినుకుగా అన్నాడు. "ఏటిసార్ ప్రాజెక్టు గురించిన విషయాలేమీ తెలీనట్టు అడుగుతారు"

అర్థం కాలేదు.

వీర్రాజు జేబులోంచి ఓ పేపర్ కటింగ్ తీసి చూపించాడు 'చదవండి' అని అది 'నేడు' అని ఒక స్థానిక పేపరల్లో పడిన వార్త.

దొంతమూరు పథకాన్ని మార్చిందెవరు?

కాకినాడ, ఏప్రిల్ 11: దొంతమూరులో వాటర్ టాంకుల నిర్మాణం విషయంలో తెర వెనుక నడిచిన రాజకీయాలు ఆసక్తికరంగా వున్నాయి. వేలాది మంది దాహార్తిని తీర్చే వాటర్ టాంకుల నిర్మాణం యిప్పటికైనా కార్యరూపం ధరించడం ముదావహమే. కానీ నిర్మాణం వెనుక చోటు చేసుకున్న రాజకీయాలు వందలాదిమందిని నిర్వాసితుల్ని చేస్తున్నాయి. వాస్తవానికి ఈ టాంకులని నిర్మించడానికి మొదటగా ఇంజనీర్లు ఊరికి సమీపంలోని చెరువు ప్రాంతాన్ని ఎంపిక చేసారు. ఆ ప్రాంతంలో టాంకుల్ని నిర్మిస్తే దాని నిర్వహణ సులభంగా వుంటుందని అది నిర్మాణానికి అనువైన చోటని నిర్ధారించారు. దీనికి కలెక్టరు, రెవిన్యూ అధికారులు ఆమోదం తెలిపి ఆ మేరకు తదుపరి చర్యలు చేపట్టారు.

అయితే ఈ చెరువు ఆ గ్రామంలోని పెద్ద రైతు అధికార పార్టీ నాయకుడు బుచ్చయ్యదొర ఆక్రమణలో వుంది. దీన్ని వదులుకోవడానికి ససేమిరా ఒప్పుకోని బుచ్చయ్యదొర మంత్రి చంద్రరావుపై వత్తిడితెచ్చి నిర్మాణానికి వూరికి దూరంగానూ... నిర్వహణకి అనుకూలంకాని ప్రాంతమైన దళితుల చెరువు భూమిపైకి మళ్లించాడు. తొలుత ఇంజనీర్లు ఈ ప్రాంతాన్ని పరిశీలించి అది నిర్మాణానికి అనువైనది కాదనీ, అక్కడ నిర్మించడం వల్ల ఖర్చు విపరీతంగా పెరుగుతుందని చెప్పినా 'ఆ తరువాత' వారు కూడా ఆమోదం తెలిపారు. మంత్రి స్థాయిలో వత్తిడి రావడంతో కలెక్టర్ సైతం దీనికి అంగీకరించక తప్పలేదు. ఆర్భాటంగా జరిగిన ఈ శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రి చంద్రరావు హాజరయ్యారు. ఈ టాంకుల నిర్మాణం చేసే కాంట్రాక్టర్ బుచ్చయ్యదొర తమ్ముడు కావడం విశేషం.

ఇదీ వార్త... ఇదీ... వాస్తవం....

తన గొంతులో ఏదో వుండచుట్టుకున్నట్టయింది.

వీర్రాజు అంటున్నాడు.

"ఇది సార్ అసలు విషయం... దీన్ని ఆరోజే మీతో చెపుదామని అనుకున్నాను. కానీ మీరు వినేలా లేరు. చిన్న పత్రికలో ఈ మూల వచ్చిన వార్తని ఎవరు చూస్తారు. చూసినా చేసేదేముందను కోండి... ఆరోజు మీరన్నారే.... అభివృద్ధి కోసం త్యాగం చెయ్యాలని... వొందల ఎకరాలున్న బుచ్చయ్యదొర అడ్డంగా ఆక్రమించుకున్న చెరువుని వదల్లేదు. దాని కోసం పథకాన్నే మార్చేసాడు. నీళ్లకోసం పోరాడి.. దాన్ని సాధించే వరకూ నిద్రపోని మేం.. అభివృద్ధి నిరోధకులమయ్యాం... ఈ బుచ్చయ్య వాడి తమ్ముడూ ఆరోజు ట్రాక్టర్లూ లారీలు పెట్టి జనాన్ని తోలి మమ్మల్ని స్వార్థపరులన్నాడు. మా యిళ్లని కూలగొట్టించాడు. వాళ్లంటారు చూడండీ అభివృద్ధి కోసం ప్రాణాలిస్తాం అని నిజమే ఇస్తారు సార్... వాళ్లు అభివృద్ధి చెందిపోడానికి మా ప్రాణాలెన్నైనా ఇచ్చేస్తారు. ఈజీగా కొనేయచ్చని సార్... శేరు బియ్యం.... ఓ వెయ్యో రెండు వేలో పడేస్తే సరి....".

అతని గొంతులో ఉక్రోషం... వణుకు... కోపం... తనలో తానే అనుకుంటున్నట్టుగా అంటున్నాడు.

".... అవును మాకయితే శేరు బియ్యంతో సరి... అదే బుచ్చయ్య స్థలాన్ని ముట్టుకోగల్రా... ఒక వేళ తీసుకున్నా ఇలాగే జరుగుతుందా.... మంత్రులు మీ వాళ్ళా... అతను యిలాటి బేరాలకి వీళ్లయితే బాగుంటారు..."

అతని గొంతు దుఃఖంతో కంపించింది.

ఆగిపోయాడు.

చాలా సేపటి తర్వాత అతనే అన్నాడు.

"సర్లేండి... అయిందేదో అయిపోయింది. కాని ఫార్సేంటో తెల్సాండీ... మేం యిప్పుడీ వూరి చివర వుంటున్నాం కదా.... అక్కడ కూడా నీళ్ల సమస్యే... చాలా దూరం పోవాలి... మాకిప్పుడు కావల్సిందీ నీళ్లే..." అతను నవ్వాడు.

"కానీ ఈసారి నీళ్లు అడగాలంటే భయమేస్తోంది" ★

స్వగృహ ఫుడ్స్
Swagruha® Foods
Opp : P.W.D. Grounds, M.G. Road, VIJAYAWADA - 10
Phone : 2475763, Fax : 0866 - 2480200.
Eluru Road (Canara Bank Building),
Near Vijaya Talkies, Vijayawada - 520 002. Ph : 5526263.
10/2, Arundelpet, Guntur - 522 002. Ph : 2235350.
Visit us : www.swagruhafoods.net